షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 326 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 17 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 326 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 17 October 2024 PAGES : 8 PRICE : 5/-


## ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందే

- ఏపీ, తెలంగాణ ఐఏఎస్ అధికారులకు హైకోర్టులో చుక్కెదురు
- తమను రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని ఐఏఎస్ అధికారుల పిటిషన్
- ముందు మీరు డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో చేరాలని హైకోర్టు ఆదేశం
- మీరు ఎక్కడ పని చేయాలో కేంద్రం నిర్ణయిస్తుందన్న హైకోర్టు
- వాదనలు విని... ఐఏఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

-2లో



## సమగ్ర కులగణనకు కసరత్తు!



- ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు..
- ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది
- ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది

హైదరాబాద్

సమగ్ర కులగణన చేపట్టేందుకు జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. తెలంగాణ - మిగతా3లో



## జమ్మూకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం

- 68 ఇళ్లు దగ్ధం
- ఇళ్లు కాలిపోవడంతో నివాసితులు రోడ్డు పాలయ్యారు.
- అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక టెంట్లలో ఆశ్రయం
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు పునరావాసాన్ని కల్పించే చర్యలు

## ఇందిరమ్మ కమిటీలతో పార్టీ బలోపేతం

- కాస్త ఆలస్యమైనా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నా సీఎం
- పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇందిరమ్మ కమిటీలను ఓ అవకాశంగా ఉపయోగించుకోవాలని నిర్ణయం
- గ్రామాలన్నింటిపై ఇందిరమ్మ కమిటీల ప్రభావం ఉండేలా ప్రణాళిక
- ప్రభుత్వ ప్రతి పథకం ప్రజలకు ఇందిరమ్మ కమిటీల ద్వారానే చేరుతుందని ప్రభుత్వం యోచన



హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాలన ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇందిరమ్మ కమిటీలను ఓ అవకాశంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. కాస్త ఆలస్యమైనా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల నాటికి గ్రామాలన్నింటిపై ఇందిరమ్మ కమిటీల ప్రభావం ఉండేలా చూసుకోనున్నారు. అంటే.. ప్రతి ప్రభుత్వ లబ్దిదారుడు కాంగ్రెస్ ను దాటిపోడు. అంతే కాదు ఇతర కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లనూ చేజారిపోకుండా చూసుకోవచ్చు. - మిగతా3లో



## ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి

- సీఎం ఎవరో సంకేతాలిచ్చిన దేవేంద్ర ఫడ్నవీస్
- "సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన పని మాకు లేదు
- మా ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నారు
- ఎలాగూ అధికారంలోకి రామని తెలిసే సీఎం అభ్యర్థిని ఎంవీఏ ప్రకటించడం లేదు

### తెలంగాణ ఉన్నత విద్యామండలి

## చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

- వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియామకం
- ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు
- ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటన
- కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య

హైదరాబాద్

తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. వీరిద్దరూ ఆయా పదవుల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. కాగా, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రస్తుతం నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. ఈ రెండు నియామకాలతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు ఇంఛార్జి - మిగతా3లో





## మోదీ దీపావళి గిఫ్ట్..

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు
- 48లక్షల ఉద్యోగులు.. 67లక్షల మంది పెన్షనర్లకు గుడ్‌న్యూస్..
- వారణాసిలో రూ.2,642 కోట్లతో రైల్-రోడ్ బ్రిడ్జి
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
- రబీలో ఆరు పంటల కనీస మద్దతు ధర పెంపు..
- యూరియేతర ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం

-2లో

### విమానాలకు బాంబు బెదిరింపులు..

## కీలక నిర్ణయం తీసుకున్న కేంద్రం!

- దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల నుంచి వచ్చే విమానాల్లో స్కై మార్షల్స్‌ని రెట్టింపు చేయాలని నిర్ణయం
- గడిచిన మూడురోజుల్లో 12 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి
- ఈ క్రమంలో భద్రతా ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించి.. ఫేక్ బెదిరింపులుగా తేల్చారు



## ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు

- రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి
- కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది
- రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది
- ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది.
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్

ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంత మంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి. కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది. రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది. ఉత్తర భాగం నిర్మాణం కోసం భూసేకరణ ఇంకా ప్రారంభించలేదని హరీశ్‌రావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి నియోజకవర్గానికి రూ. 5 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో చెప్పారు. 6 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వెంటనే నియోజకవర్గ - మిగతా3లో



# పల్లె దవాఖాన నూతన భవనానికి భూమి పూజ

-ప్రజా శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యం
-బత్తిని శ్రీనివాస్ గౌడ్

**షణ్ముఖ వెలుగు శంకరపట్నం అక్టోబరు 16:** శంకరపట్నం మండలం కేశవ పట్నం నూతన గ్రామ పంచాయతీ ఎదురుగా బుధవారం కాంగ్రెస్ పార్టీ టిపిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ పల్లె దవాఖానా నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. బత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం వైద్యం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. పల్లెల్లో ప్రజలు రోగాల బారిన పడడంతో కార్పొరేట్ వైద్యం అందించక పలుచోట్ల మృత్యువాత పడ్డ సంఘటనలను గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయాలనే ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కుటుంబంలో మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఇల్లు బాగుంటుందన్నారు. మహిళలు ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన



తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మీస రమేష్, సిహెచ్ఓ భాస్కర్ హెల్త్ సూపర్వైజర్ అనిల్ మండల అధ్యక్షుడు బసవయ్య బండారి తిరుపతి ఎఎన్ఎంలు ఆశా వర్కర్ లు పాల్గొన్నారు.

# జ్యోతిగా పూలే కు ఘనంగా పుష్పాభిషేకం

**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 16:** తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుల గణన ప్రక్రియను ప్రారంభించాలని జీవో నెంబర్ 18ని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా నర్సంపేట పట్టణంలోని జ్యోతిగా పూలే ప్రాంగణం వద్ద వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జీ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా పుష్పాభిషేకం చేశారు. అనంతరం డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మేము అధికారంలోకి వస్తే సమగ్ర కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో తెలంగాణలో బీసీలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం జరిగిందని డ్యాగల శ్రీనివాస్ అన్నారు. దానికి అనుగుణంగానే జీవో నెంబర్ 26 ను తీసుకొచ్చి సమగ్ర కుల గణన చేపట్టడానికి 150 కోట్ల బడ్జెట్ ను విడుదల చేసి తొమ్మిది నెలలు గడుస్తున్న కుల గణన పట్ల ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీ మిలియన్ మార్చ్ కు పిలుపునిచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తో చర్చలు జరిపించి అతి త్వరలో సమగ్ర కుల గణన చేపడతామని హామీ ఇచ్చి మాట ప్రకారం తెలంగాణ ముఖ్యమంత్రి కుల గణన కు అనుగుణంగా జీవో నెంబర్ 18ని విడుదల చేస్తూ కమిటీని ఏర్పాటు చేయడంతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు నర్సంపేట పట్టణంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పుష్పాభిషేకం చేయడం జరిగిందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నందగిరి రజనీకాంత్ గాదెగొని బిక్షపతి గౌడ్ పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యాం కుమార్ యాదవ్ గట్టు ఆనంద్ కుమార్ పట్టణ కార్యదర్శి ఓడపల్లి రమేష్ మండల నాయకులు కందికొండ కుమార్ షేర్ల శ్రీనివాస్ బండి కొమురయ్య గంగ్రాతి శ్రీనివాస్ సామల సత్యం దీకొండ హేమసుందర్ శీరంశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సర్పంచు పొనగంటి మల్లయ్య జన్మదిన వేడుకలు

పేదలకు అన్నదానం చేసిన పొనగంటి మల్లయ్య





**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి అక్టోబరు 16:** జమ్మికుంట మాజీ సర్పంచ్ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొనగంటి మల్లయ్య జన్మదినం పురస్కరించుకొని ఆయన అనుచరులు జమ్మికుంట పట్టణంలోని బొమ్మల గుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తూ అనేక పదవులను అధిరోహించిన పొనగంటి మల్లయ్య ఇలాంటి మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పొనగంటి మల్లయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లు బొంగోని వీరన్న దిడ్డి రాము పొనగంటి సారంగం కాంగ్రెస్ పార్టీ నాయకులు పొనగంటి సురేష్ దేశిని సదానందం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఒమర్ అబ్దుల్లా..

ఇవాళ ఉదయం జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్ర నేత ఒమర్ అబ్దుల్లా మధ్యాహ్నం సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుంటున్నట్టు ఆయన సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. అనంతరం జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన సెక్రెటరీలతో ఒమర్ సమావేశమయ్యారు. జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. కాగా ఉదయం 11.30 గంటలకు ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు.

## పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలి

- ఎబివిపి వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్


**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 16:** పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని ఎబివిపి వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న రూ. 7500 కోట్లను బకాయిలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే విద్యా సంస్థలకు ఫీజు రీయింబర్స్మెంట్ సమయానికి విడుదల చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్స్ వలన విద్యార్థులు పై చదువులకు దూరం అవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ను విడుదల చేయకుండా విద్యార్థుల ఉసురు తీసిన ఘనత గత ప్రభుత్వానిదేనని మండి పడ్డారు. కొత్త ప్రభుత్వం వస్తె ఇకనైనా విద్యార్థులకు న్యాయం



జరుగుతుంది అని ఓటు వేస్తే ఇప్పటివరకు ఒక్క రూపాయి విద్యార్థుల ఖాతాల్లో వేసిన పాపాన పోలేదు అని మండి పడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సిగ్గు తెచ్చుకొని వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ను విడుదల చేయాలనీ కోరారు. లేదంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## కోరుట్ల నియోజకవర్గానికి 14.30 కోట్ల నిధులు మంజూరు

**షణ్ముఖ వెలుగు కోరుట్ల రూరల్ ప్రతినిధి అక్టోబరు 16:** కోరుట్ల నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల్లో వంతెనల నిర్మాణం కోసం 14 కోట్ల 30 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగ్ రావు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు లు విలేఖరులకు తెలిపారు కోరుట్ల పట్టణంలో విలీన గ్రామమైన యెకిన్ పూర్ సంగెం గ్రామాల మధ్య వంతెన నిర్మాణం కొరకు ఒక కోటి 50 లక్షల రూపాయలు కోరుట్ల జంబి గద్దె సంగెం మధ్యన మూడు కోట్ల 80 లక్షల రూపాయలతో హై లెవెల్ వంతెన నిర్మాణం దీంతో పాటు మెట్ పల్లి మండలం లోని కొండ్రికర్ల కోనరావుపేట మధ్యలో పెద్దవాగు పై నాలుగు కోట్ల రూపాయలతో హై లెవెల్ వంతెన నిర్మాణం మండలం లోని పెద్దాపూర్ రామారావు పల్లె మధ్యలో రెండు కోట్ల 80 లక్షల వ్యయంతో



వంతెన నిర్మాణం మల్లాపూర్ మండల కేంద్రం నుండి వడ్డెర కాలనీ మధ్యలో రెండు కోట్ల 20 లక్షల వ్యయంతో వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి అని అన్నారు. ఈ నిధులు మంజూరు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దినసరి సీతక్క లకు ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్ రావు జువ్వాడి కృష్ణారావు లు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు

## మంచినీటి శుద్ధి పై సిబ్బంది అశ్రద్ధ వహించకూడదు



**షణ్ముఖ వెలుగు శంకరపట్నం ప్రతినిధి అక్టోబరు 16:** శంకరపట్నం మండల ప్రజా పరిషత్తు సమావేశ మందిరంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మొగిలి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ మంచినీటి సహాయకులకు మొదటి రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి ఈ కాజా వసియోద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మంచినీటి పైపు లైన్‌ల నిర్వహణ వాటర్ నీటి నాణ్యత పరీక్షలు క్లోరినేషన్ ప్రక్రియపై నాలుగు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాఘవేంద్ర రెడ్డి మిషన్ భగీరథ శిక్షణ ట్రైనర్ లు రవీందర్ రెడ్డిచారి మండల పరిధిలోని మంచినీటి సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఎస్సై కొత్తపల్లి రవి



**షణ్ముఖ వెలుగు శంకరపట్నం ప్రతినిధి అక్టోబరు 16:** శంకరపట్నం మండలం మెట్టు పల్లి జడ్పీ హెచ్ ఎస్ లో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహన కల్పించిన ఎస్సై రవి. రవి మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా యువత పని చేయాలని కోరారు. నేటి తరంలో విద్యార్థులు సరదాలు సెల్ ఫోన్లకు,మందుకు డ్రగ్స్ కు అలవాటై తమ విలువైన జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థిని దశలో చెడు స్నేహితులతో సిగరెట్టు మందుకు అలవాటు పడి మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు చదువులో వెనుకబడడం పరీక్షలు సరిగా రాయకపోవడం ఒంటరిగా ఉండడం,ప్రవర్తనలో మార్పు లను గమనిస్తూ ఉండాలన్నారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధులతో క్రమశిక్షణ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## సిరికొండ లో బైక్ ఢీ ఒక వ్యక్తి మృతి

**షణ్ముఖ వెలుగు కథలా పూర్ ప్రతినిధి అక్టోబరు 16:** జగిత్యాల జిల్లా కథలా పూర్ మండలంలోని సిరికొండ బస్టాండ్ సమీపంలో బుధవారం ఘోర ప్రమాదం జరిగింది సిరికొండ బస్టాండ్ సమీపంలో ఇదే గ్రామానికి చెందిన చెట్ పల్లి పెద్ద అంజయ్య (55) నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా అతనిని టూ వీలర్ బండి నీ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ కథలా పూర్ కు చెందిన అనిల్ కుమార్ ఢీ కొనగా అతని తలకు బలమైన గాయాలు అయ్యాయి అతనిని తన కొడుకు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని మృతుని కొడుకు చెట్పల్లి హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది అని కథలా పూర్ ఎస్సై జి నవీన్ కుమార్ తెలిపారు



## ఆలేరు తహసిల్దార్ అంజిరెడ్డిని సన్మానించిన రేషన్ డీలర్లు

**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి అక్టోబరు 16:** ఆలేరు మండల రేషన్ డీలర్ల కమిటీ ఆధ్వర్యంలో ఆలేరు నూతన తహసిల్దార్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల శంకర్ మండల అధ్యక్షులు దూడల రోశయ్య గుజ్జ అశోక్ వంగరి శివకుమార్ గ్యార ఎల్లయ్య ఎలుగల శివ సుక్క సుధాకర్ ముద్దేపాక శరత్ ఈరసారపు వెంకటేష్ సుదగాని బిక్షపతి దశరథ తదితరులు పాల్గొన్నారు.



## బండి రాజుల శంకర్ కు మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డు

**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి అక్టోబరు 16:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయం వ్యవహర్త ప్రధానాచార్యులు బండిరాజుల శంకర్ ను “మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డు-2024” కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ ఎం రాజ్ నారాయణ్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ ప్రతి సంవత్సరం కౌన్సిల్ ఆధ్వర్యం లోని సెలెక్షన్ కమిటీ విద్యా రంగంలో సేవలందిస్తున్న విద్యావేత్తలను ఎంపిక చేసి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం యాదాద్రి భువనగిరి జిల్లా నుండి నాలుగు దశాబ్దాలుగా విద్యారంగంలో అలుపెరుగని సేవలు అందిస్తున్న బండి రాజుల శంకర్ ను ఎంపిక చేశామన్నారు. ఈనెల 22న హైదరాబాద్ లోని సారస్వత పరిషత్తు లో జరుగనున్న మహాత్మా గాంధీ జయంతి ముగింపు ఉత్సవాల్లో ప్రముఖులు చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం జరుగుతుందని డాక్టర్ రాజ్ నారాయణ్ పేర్కొన్నారు.



# జీడిమెట్ల పారిశ్రామిక వాడలో విషాదం... కెమికల్ ట్యాంక్ క్లీన్ చేస్తూ అన్న తమ్ముళ్లు మృతి







**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి అక్టోబరు 16:** కెమికల్ పరిశ్రమలోని సంపు క్లీన్ చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందగా మరో కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో సాబూరి ఫార్మా కంపెనీలో ఇద్దరు(కవలలు) రామ్(34) లక్ష్మణ్(36)లు పని కోసం వచ్చారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కెమికల్ సంపులో పనిచేస్తుండగా మొదట ఒక సోదరుడు సంపులో పడిపోగా అతని వెలికి తీయడానికి తమ్ముడు సంప లోకి దిగాడు ఘాటైన వాసనలకు ఉక్కిరి బిక్కిరై ఇరువురు అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయారు.వారిని కాపాడే క్రమంలో సురేందర్ రెడ్డి అనే కార్మికుడు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. సంపులో పడిపోయిన వారిని వెంటనే గమనించిన తోటి కార్మికులు మొత్తం ముగ్గురిని షాపూర్ నగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామ్ లక్ష్మన్ లను పరిశీలించిన వైద్యులు అప్పటికే వారు మృతి చెందారని ప్రకటించారు. మరో కార్మికుడు సురేందర్ రెడ్డి పరిస్థితి విషమంగానే ఉందని చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. ఆసుపత్రి వర్గాల నుంచి సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కార్మికుల వివరాలు సేకరిస్తున్నారు. పరిశ్రమ వద్ద యాజమాన్యం తరఫున ఎటువంటి వారు లేకపోవడంతో



మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ తరలించామని జీడిమెట్ల ఇన్చార్జి సీఐ కనకయ్య తెలిపారు. మృతుల తరపు నుండి ఇంకా ఎవరు రాలేదని వారు వచ్చిన వెంటనే ఫిర్యాదు స్వీకరించి ప్రమాదానికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని జీడిమెట్ల సిఐ తెలిపారు.

# హైడ్రా కారణంగా భయానక వాతావారణం

**హైదరాబాద్ :** తెలంగాణ భవన్ లో నగర ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలతో మూసీ ప్రాజెక్టు పైన కేటీఆర్ సమావేశం నిర్వహించారు. తరువాత మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆనాలోచిత నిర్ణయాల కారణంగా హైదరాబాద్‌లో పేదలు దిగువ మధ్యతరగతి ప్రజలు సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభుత్వం ఆనాలోచితంగా, ప్రణాళిక లేకుండా పేదలకు ఎవరూ అండగా లేరన్నట్లుగా దూకుడుగా వారి మీదకు వెళ్తోంది. మోడీ నోట్ల రద్దు చేసినప్పుడు ఏ విధంగా రకరకాల కారణాలు మారుస్తూ చెప్పారో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతి అవలంభిస్తోంది. ఒక రోజు మూసీ సుందరీకరణ అంటారు. ఒక రోజు నల్గొండకు నీళ్లు అంటారు. ఒక రోజు రూ. లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి అంటారు. ఒక రోజు డీపీఆర్ లేనే లేదంటారని అన్నారు. ఒక ప్రణాళిక, ఆలోచన లేకుండా ముందుకు వెళ్తున్నారు. ప్రభుత్వమే 50 ఏళ్ల క్రితమే పర్మిషన్లు ఇచ్చి ఇప్పుడు వాటిని కూలగొడతామని దుందుడుకుగా పోతామంటే కుదరదు. హైడ్రా, మూసీ ప్రాజెక్ట్ విషయంలో ఒక భయానక వాతావారణాన్ని సృష్టించారు.

హైడ్రాను పెద్ద, పెద్ద బిల్డర్లను బెదిరించేందుకే ఉపయోగిస్తున్నారని మేము నమ్ముతున్నాం. మూసీ పేరిట ఏ విధంగా లూటీ చేస్తున్నారో ప్రజల దృష్టికి తీసుకెళ్తాం. మూసీ కి సంబంధించి 100 శాతం మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను మేము రూ. 4 వేల కోట్లతో నిర్మించామని అన్నారు.

మూసీ శుద్ధి మేము చేశాం. దీంతో ఇక నల్గొండ జిల్లాకు వెళ్లే నీళ్లన్ని శుద్ధి చేసిన నీళ్లే వెళ్తాయి. దాని కోసం కొత్తగా ఖర్చు చేయాల్సిన పని లేదు. కొండపోచమ్మ సాగర్ నుంచి గండిపేట్ కు నీళ్లు తెచ్చేందుకు 11 వందల కోట్లు ఖర్చు చేయాలని మేము నిర్ణయం తీసుకున్నాం. ఇక రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. నల్గొండకు మంచి నీళ్లు ఇచ్చే ఏర్పాట్లు మేము చేశాం. ఇక నల్గొండ కు నీళ్లు ఇచ్చే ఇష్టం లేదా అంటూ ముఖ్యమంత్రి గారు ఆరోపణలు చేయాల్సిన అవసరం లేదు. గతంలోనే మేము మూసీ సుందరీకరణ చేపట్టాలని సుధీర్ రెడ్డి ఛైర్మన్ గా ప్రయత్నం చేశాం. కానీ గరీబోళ్లకు అన్యాయం జరుగుతదంటే ఆ ప్రాజెక్ట్ వద్దని కేసీఆర్ చెప్పారు. మానవీయ ముఖ్యమంత్రి ఉంటే ఆ విధంగా నిర్ణయాలు ఉంటాయి. మూసీ సుందరీకరణ మేము కూడా చేశాం. కానీ ఒక్క పేదవాడి కడుపు కూడా కొట్టలేదు. మూసీ సుందరీకరణకు రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకో చెప్పాలి. 50 ఏళ్ల క్రితం పట్టాలిచ్చిన వారిని హైడ్రా పేరుతో కూల్చివేస్తామంటే కుదరదు, మీరు చేసిన తప్పునకు పేదలను బలి చేస్తారా? మీరే పట్టాలిచ్చి మీరే కూలగొడుతారా అని



ప్రశ్నించారు. పేదలకు ఎవరు దిక్కు లేరన్నట్లుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తామంటే బీఆర్ఎస్ ఊరుకోదు. హైదరాబాద్ లోని పేదలకు బీఆర్ఎస్ రక్షణ కవచంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా మా నాయకులు ఉంటారు. మేము నిర్మించిన అన్ని ఎస్టీపీలను కూడా మా ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటిస్తామని అన్నారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు నాలా డెవలప్ మెంట్ కార్యక్రమం తీసుకున్నాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలను కూడా సందర్శిస్తాం. హైడ్రా పేరుతో ప్రభుత్వం భయపెడుతున్న అన్ని ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలకు మేము భరోసా ఇస్తాం. అదే విధంగా ప్రభుత్వం చట్టాన్ని గౌరవించకపోతే మేము న్యాయపరంగా కూడా పోరాటం చేస్తాం. ఆర్ఎస్ లీగల్ సెల్ కు దాదాపు 450 మంది వచ్చి అండగా ఉండాలని కోరారు. మా పార్టీ లీగల్ సెల్ ను మరింత బలోపేతం చేస్తాం. లీగల్ సెల్ వాళ్లు చాలా కష్టపడి పనిచేస్తున్నారు. వారికి అభినందనలు. ఈ ప్రభుత్వం చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ప్రజలను కబ్జాదారులు అంటున్న విధానాన్ని ఎండగడతాం, హైడ్రా కారణంగా భయానక వాతావారణం వచ్చింది. మొన్న హైడ్రా పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం నాయకులే కొట్టుకున్నారు. ఈ ప్రభుత్వ దిక్కుమాలిన పాలన కారణంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయింది. మాకు అప్పు పుట్టటం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అంటున్నారు. మీ ముఖ్యమంత్రే దివాళా కోరు మాటలు మాట్లాడితే అప్పులు ఎలా పుడుతాయి. నిర్మాణం కాదు విధ్వంసం చేస్తామంటే ఇలాంటి పరిస్థితే ఉంటుంది. బీజేపీ నాయకుల కన్నా ఎక్కువగా రేవంత్ రెడ్డి దేశ రక్షణ గురించి మాట్లాడుతున్నాడు. ఆయన మాటలు ఆశ్చర్యంగా అనిపించాయి. దేశ రక్షణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉంది. ఏ మూసీ సుందరీకరణ అంటున్నావో, అదే ప్రాంతంలో 12 లక్షల చెట్లు నరికివేసి ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా ఎలా న్యాయం చేస్తారు. గంగా నది పుట్టిన గంగోత్రి వద్ద 150 కిలోమీటర్లు ఎకో సెన్సిటివ్ జోన్ అంట. మరి మూసీకి కనీసం 10 కిలోమీటర్ల ఎకో సెన్సిటివ్ జోన్ లేదా? మేమే కేబీఆర్ పార్క్ వద్ద ఫ్లై ఓవర్లు కట్టాలని అనుకున్నాం. పర్యావరణం దెబ్బతింటుందంటే ఆ ప్రతిపాదనలను విరమించుకున్నాం. 2017 లో రాడార్ నిర్మాణం కోసం జీవో ఇచ్చినప్పటికీ పర్యావరణం దెబ్బ తింటుందంటే మేము ఆ జీవో ను తొక్కి పెట్టామని అన్నారు. మేము జీవో ఇచ్చామని చెబుతున్నావ్. మేము చేసిన పనులన్నీ చేస్తున్నావా? రైతు బంధు, 24 గంటల కరెంట్, ఫించన్, పాలమూరు ఎత్తిపోతల మేము చేశాం. మరి నువ్వు వాటిని చేస్తున్నావా? మేము పర్యావరణ రక్షణ కోసం పనిచేశాం కాబట్టే ఇచ్చిన జీవోలను నిలిపివేశాం. రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీని ఒక్క మాట అనాలంటే దడ. అందుకే మనకు కేంద్ర బడ్జెట్ లో అన్యాయం జరిగినప్పటికీ అసెంబ్లీలో ఒక్క మాట మాట్లాడలేదని అన్నారు. జనవాసాలు లేని చోట పెట్టే రాడార్ కేంద్రాన్ని?తెలంగాణలో ఎందుకు పెట్టినట్లు? మూసీని పురిట్లోనే ఆగం చేసి కింద మాత్రం మంచి చేస్తామంటే ఎవరూ నమ్ముతారు. హైదరాబాద్ లో ప్రజలకు భరోసా ఇచ్చేందుకు మా నాయకులంతా కలసికట్టుగా కదులుతాం. ప్రజలకు ఏమైనా ఇబ్బంది వస్తే మా ప్రజాప్రతినిధులను కలవండి. లేదంటే తెలంగాణ భవన్ కు రండి. మీకు న్యాయం తప్పకుండా జరగుతుంది. మా ఫార్మ్ హౌస్ లు చట్ట విరుద్ధంగా ఉంటే వాటిని కొట్టేయండి. మా ఫార్మ్ హౌస్ లు కూలగొడితే నీకు రాక్షస ఆనందం వస్తదంటే కూలగొట్టు. కానీ పేద ప్రజల జోలికి వెళ్లకు. పేద ప్రజలను ఆగం చేస్తామంటే వారి ఇళ్లు కూలగొడతామంటే ఊరుకోం, మేము అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న బకాయి ఫీజు రీయింబర్స్ మెంట్ 2 వేల కోట్లను చెల్లించాం. ప్రభుత్వం అనేది కంటిన్యూ ప్రాసెస్. గత ప్రభుత్వ బకాయిలను చెల్లించాలి. రూ. 650 కోట్లు ఇస్తే సరిపోతుందని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తే దాదాపు 12 లక్షల మందికి మేలు జరుగుతుంది. గత ప్రభుత్వాలు బకాయిలు పెడితే ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు కట్టాల్సిందే. అది నెక్స్ మేము అధికారంలోకి వచ్చినా తప్పదని అన్నారు. రేవంత్ రెడ్డి 10 నెలల్లో 80 వేల కోట్ల అప్పు చేశారు. ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా చేపట్టలేదు. మరి అంత డబ్బు ఎక్కడికి పోయింది. మన రాష్ట్రం రెవెన్యూ సర్ ప్లేస్ స్టేట్. మనం అన్ని కట్టిన తర్వాత కూడా మిగులు ఉందని భట్టి చెప్పారు. మరీ ఎందుకు ఇంత పెద్ద ఎత్తున అప్పు చేశారో చెప్పాలి. హైడ్రా, మూసీ పేరుతో సృష్టిస్తున్న భయాకన వాతావారణం నుంచి ప్రజలను రక్షించేందుకు బీఆర్ఎస్ కదులుతోంది. త్వరలోనే షెడ్యూల్ ప్రకటిస్తామని అన్నారు.

# ఇందిరమ్మ కమిటీలతో పార్టీ బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరవాత ఇందిరమ్మ కమిటీల ప్రస్తావన తెచ్చారు. ప్రభుత్వ ప్రతి పథకం ప్రజలకు ఇందిరమ్మ కమిటీల ద్వారానే చేరుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పార్టీని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా చేయాలని ఆయన అనుకున్నారు. కారణం ఏమైనా తర్వాత ఆలస్యం జరిగింది. రుమమాఫీని ప్రకటించారు. హడావుడిగా అమలు చేశారు. కానీ ఆ రుణమాఫీని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం సరిగ్గా జరగలేదు. ఇందిరమ్మ కమిటీలు ఉంటే నేరుగా ఇంటింటికి తీసుకెళ్లేవారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పుడు ఆ కమిటీ చేతుల మీదుగానే ఇళ్ల నిర్మాణ పథకానికి లబ్దిదారులను ఎంపిక చేయబోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్ని ఇప్పటికే నిర్వహించాల్సి ఉంది. కానీ కులగణన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇప్పుడు ప్రక్రియను ప్రారంభించారు. నివేదిక వచ్చిన తర్వాత ఇతర చట్టపరమైన పనులు పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించాలంటే మరో నాలుగైదు నెలల సమయం పట్టవచ్చు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ పాలక మండలులు గడువు మాత్రమే ఇప్పటికి ముగిసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు



మరో ఏడాది వరకూ ఉంది. అన్నీ ఒకే సారి పెట్టేద్దామని అనుకుంటే.. మరో ఏడాది తర్వాత ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అప్పటికి ఇందిరమ్మ కమిటీ గ్రామాల్లో పట్టు సాధించే అవకాశం ఉంది. నిజానికి ఇందిరమ్మ కమిటీలు వంటి ఏర్పాటు రెండు వైపులా పదునున్న కత్తి లాంటివి. ఎందుకంటే ఎంత ప్లస్ ఉంటుందో అంత మైనస్ ఉంటుంది. ఈ కమిటీల సభ్యులు ప్రజలతో పారదర్శకంగా వ్యవహరించారు. అర్హులైన లబ్దిదారులను మాత్రమే ఎంపిక చేయాలని ఎక్కడైనా పక్షపాతం చూపించినట్లుగా ఆరోపణలు వస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. అందుకే ఇందిరమ్మ కమిటీల సభ్యుల్లో కీలకమైన వ్యక్తుల్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంది. ఇప్పుడు సర్పంచ్‌లు లేరు కాబట్టి స్పెషలాఫీసర్లే కమిటీ ఛైర్మన్ గా ఉంటారు. అయినా పార్టీ నేతల ప్రభావం ఎక్కువ గానే ఉంటుంది. ఈ కమిటీలపై వ్యతిరేక ప్రచారం సహజం గానే జరుగుతుంది. కానీ ప్రజలు నమ్మకంగా ఉండేలా చూసుకోవడం ఆ కమిటీల మీదనే ఆధారపడి ఉంటుంది. అంతా సాఫీగా సాగితే కాంగ్రెస్ పార్టీ పునాదుల్ని ఇందిరమ్మ కమిటీలు మరింత బలోపేతం చేస్తాయని అనుకోవచ్చు.

## తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

-మొదటిపేజీ తరువాయి

వీసీలను ప్రభుత్వం మార్చింది. కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య, బాసర ట్రిపుల్ ఐటీ ఇంఛార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్‌ను నియమించారు. కాగా, సూర్య ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

## సమగ్ర కులగణనకు కసరత్తు!

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని గత కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటం విశేషం.

### సమగ్ర వివరాల సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు. రాజకీయ అవకాశాలు లభిస్తాయని ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మొత్తం జనాభాలో సుమారు 52 శాతం బీసీ జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఏళ్ల నుంచి ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఈ సర్వే జరిగే రెండు నెలల పాటు ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యుటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలిసింది. సర్కారు నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలుపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.


## తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం...

**కారు కాల్వలో పడి ఏడుగురి మృతి**

**మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు**

**మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో విషాదం**

**కారు కాల్వలో పడటంతో నీళ్లలో మునిగి మృతి**




తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ కారు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మృతి చెందినవారిలో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు, ఓ పురుషుడు ఉన్నారు. మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలం ఉసిరికపల్లి వద్ద ఈరోజు సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులను పాముబండ తండాకు చెందిన వారిగా గుర్తించారు. రోడ్డుపై గుంతలు ఉండటంతో వేగంగా వెళుతున్న కారు కల్వర్టును ఢీకొట్టింది. కారు ఎగిరి పక్కనే ఉన్న కాల్వలో పడింది. దాంతో కారులో ఉన్న వారు నీట మునిగి చనిపోయారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

### సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

మెదక్ జిల్లా రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని, అవసరమైన సాయం అందించాలని ఆదేశించారు.

## ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉన్న పథకాలు బంద్ పెట్టడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు. మహిళలకు 2 బతుకమ్మ చీరలు ఇస్తామని రేవంత్ రెడ్డి మోసం చేశారు. రూ. 15 వేలు రైతుబంధు అన్నారు.. గుండుసున్నా చేశారు. కేసీఆర్ కిట్ కంటే మంచిది ఇస్తామని పేద గర్భిణులను మోసం చేశారు. ఆగస్టులో వేయాల్సిన చేప పిల్లలను, అక్టోబర్‌లో వచ్చినా వేయలేదు. చేప పిల్లల కోసం బడ్జెట్‌లో రూ. 16 కోట్లే పెట్టారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

### తెలంగాణలో 8,490 ఎంబీబీఎస్ సీట్లు..

ఎంబీబీఎస్ చదువును గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువ చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద బిడ్డలు కూడా ఎంబీబీఎస్ చేసే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ పాలనను కొనియాడుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యకు హబ్‌గా మారిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ సీట్ల సంఖ్యలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఒకప్పుడు సామాన్యులకు అందుబాటులో లేని వైద్య విద్య ఇప్పుడు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణలో కేవలం ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ సంఖ్య 34కి చేరిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. 2014 వరకు తెలంగాణలో 2,850 మెడికల్ సీట్లు ఉంటే.. ప్రస్తుతం 8,490 సీట్లు ఉన్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ఆల్ టైమ్ రికార్డును ఎవరూ చెరిపేయలేరని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## ఇద్దరు పిల్లల తల్లిపై మోజు పడి,,,

**హైదరాబాద్ :** సూరారం పీఎస్ పరిధిలో నాలుగు రోజుల కనిపించకుండా పోయిన చిన్నారి కేసు విషాదాంతమైంది.హైదరాబాద్ సూరారం బాలిక హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అనుమానితుడిగా తిరుపతి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించడంతో కీలక విషయాలు బయటకొచ్చాయి. మొత్తం కుటుంబాన్ని చంపేందుకు నిందితుడి కుట్ర చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాలిక తల్లిపై మనసుపడ్డ నిందితుడు తిరుపతి.. ఇద్దరు పిల్లలు, ఆమె భర్తను చంపేందుకు ప్లాన్ చేసినట్లు ఒప్పుకున్నాడు. దానిలో భాగంగానే.. పిల్లల్ని చంపేసి ముళ్ల పొదల్లో పడేయాలని నిర్ణయించుకుని ఒక బాలికను దారుణంగా హత్య చేసిన నిందితుడు.. మరో చిన్నారి హత్యకు సిద్ధమైనట్లు పోలీసుల విచారణలో వెల్లడి కావడం కలకలం రేపుతోంది. ఇక.. పాపను హత్య చేసి మేడ్చల్ అటవీ ప్రాంతంలో వేసినట్లు చెప్పడంతో ఆయా ప్రాంతాల్లో గాలించారు పోలీసులు. దాంతో.. అటవీ ప్రాంతంలో మూట కట్టి పడేసిన ఓ సంచిని స్వాధీనం చేసుకున్నారు. పాప డెడ్‌బాడీగా గుర్తించి.. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు పోలీసులు.. కాగా.. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాసరగడి గ్రామంలో గోనె సంచిలో బాలిక మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు.అదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభాకర్ కుటుంబంతో సూరారంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 12న కుమార్తె ఏం.జోష్న (7) కనిపించడం లేదని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పోలీసులు బాలిక కోసం దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే.. అనుమానంతో తిరుపతిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

షణ్ముఖ
# వెలుగు

ePaper
www.shanmukhavelugu.com

4 గురువారం 17 అక్టోబర్ 2024

## 18న ఆలేరు లో పిడిఎస్ యూ అర్థ శతాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం




**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి అక్టోబరు 16:** ఈ నెల 24న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ టాగోర్ ఆడిటోరియంలో పి డి ఎస్ యూ అర్థ శతాబ్ది ఉత్సవ సభను విజయవంతం చేయడం కోసం ఈనెల 18న ఆలేరు లోని దినేష్ గార్డెన్స్ లో సన్నాహక సభను ఏర్పాటు చేయనున్నట్లు పి డి ఎస్ యూ పూర్వ అధ్యక్ష కార్యదర్శులు గడ్డం నాగరాజు బేజాడి కుమార్ లు తెలిపారు. హైదరాబాద్ సభకు సంబంధించిన కరపత్రాలను ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో కలిసి బుధవారం ఆవిష్కరిస్తూ మాట్లాడుతూ పి డి ఎస్ యూ ఏర్పడి 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా సన్నాహక సభకు మాజీ ప్రస్తుత విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రగతిశీల భావాలతో ర్యాగింగ్ భూతానికి వ్యతిరేకంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జార్జిరెడ్డి స్థాపించిన పి డి ఎస్ యూ 50 ఏళ్లుగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ ఉదయ్ ప్రవీణ్ మురళి కుమార్ శ్రావణి సంధ్య రాజు కిరణ్ మల్లేష్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుడు శరత్ కు డాక్టరేట్



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 16:** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న శరత్ బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. టు స్ట్రోక్ పెట్రోల్ ఇంజన్ పనితీరు మెరుగుదల తగ్గింపు కోసం ట్విన్ స్పార్క్ ప్లగ్ టెక్నాలజీ అనే అంశంపై మిజోరాం లోని ఎన్ఐటీ పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. అందుకుగాను ఆయనకు డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా శరత్ ను కళాశాల యాజమాన్యం అధ్యాపకులు అభినందించారు.

## గురుకుల పాఠశాలల్లో చదివి ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచిన వారిని అభినందించిన బిఆర్ఎస్



### వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్...

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి అక్టోబరు 16:** మధ్య తరగతి కుటుంబంలో జన్మించి గురుకుల పాఠశాలల్లో సీట్లను పొంది ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచిన కుత్బుల్లాపూర్ కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలువగా గురుకుల పాఠశాలలో చదివి ఉన్నతవిద్యలో రాణించిన వారిని కేటిఆర్ అభినందించారు. వివరాల్లోకి వెళితే కుత్బుల్లాపూర్ 127 రంగారెడ్డి నగర్ డివిజన్ వెంకట్రామిరెడ్డి నగర్ లో నివాసముండే మధ్యతరగతి కి చెందిన రాగి రామకృష్ణ ముదిరాజ్ లావణ్య దంపతులు జిరాక్స్ వ్యాపారం నిర్వహించుకుంటూ ముగ్గురు పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి స్వాతి తరుణ్ తేజ్ శ్వేత అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉన్నత విద్యతో కన్న తల్లిదండ్రులకు పుట్టిన ఊరికి మంచి పేరు తేవాలనే దృఢ నిశ్చయంతో రాగి స్వాతి అంకిరెడ్డి పల్లి గర్ల్స్ గురుకుల క్యాంపస్ లో ఆరవ తరగతి సీటు పొంది అక్కడే ఇంటర్మీడియట్ వరకు చదివి ఏ గ్రేడ్ తో జేఎన్టీయూ సంగారెడ్డిలో బీ.టెక్ (సిఎస్ ఎం) సీటు సాధించింది అదేవిధంగా తరుణ్ తేజ్ తుర్కపల్లి క్యాంపస్ లో ఏడవ తరగతి సీటు సాధించి అక్కడే పదవ తరగతి పూర్తిచేసుకుని, మహేశ్వరం లోఇంటర్మీడియట్ పూర్తి చేసి జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. చిన్న కూతురు అయిన రాగి శ్వేత కుత్బుల్లాపూర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి లో సీటు సాధించి అక్కడే పదవ తరగతి పూర్తి చేసుకోగా ప్రస్తుతం ఘట్కేసర్ లోని గురుకుల గర్ల్స్ క్యాంపస్ నందు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తుంది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తును రూపొందించు కోవాలనుకునే నిరుపేద విద్యార్థుల కలలను నెరవేర్చాలని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గురుకుల పాఠశాల సంఖ్యను పెంచి పౌష్టికాహారం తో కూడిన విద్య అందించారని అలాంటి పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన మీరు భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలన్నారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ తో
# విద్యను అందిస్తున్న ప్రైవేటు కళాశాలలు

### ఆవేదన తో ప్రైవేట్ కళాశాల అధ్యాపకులు




**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి అక్టోబరు 16:** తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక బంద్ 3 వ రోజు కార్యక్రమంలో జమ్మికుంట పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల డైరెక్టర్ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద మధ్య తరగతి విద్యార్థుల కోసం వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో నివసిస్తున్న విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ ఉందని ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్ పొంది ఫీజు రీయింబర్స్మెంట్ రాకపోవడం వలన తమ చదువులను మధ్యలోనే నిలిపి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ తో విద్యను అందిస్తున్న ప్రైవేటు కళాశాలలు ఫీజు రీయింబర్స్మెంట్ రాకపోవడం వలన అప్పులపాలై లెక్చరర్ల కు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి ప్రైవేట్ కళాశాలలను ఆదుకొని విద్యార్థుల యొక్క ఉన్నత చదువులకు తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం అధ్యాపక బృందం విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల బదిలీలు



**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి అక్టోబరు 16:** హుజురాబాద్ 327 డివిజన్ అధ్యక్షులు విజ్జి గిరి అంజయ్య కనగర్తి లైన్ మెన్ నుండి రిలీవ్ అయ్యి బిజిగిరి షరీఫ్ లైన్ మెన్ గా తనుగుల ఏఈ సారయ్య జాయిన్ చేసుకున్నారు అలాగే ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం హుజురాబాద్ డివిజన్ అధ్యక్షులు మారపెల్లి సంజీవరావు జమ్మికుంట టౌన్ ఫోర్ మెన్ గా రిలీవ్ అయ్యి హుజురాబాద్ రూరల్ ఫోర్ మెన్ గా ఏఈ సంపత్ రెడ్డి జాయిన్ చేసుకున్నారు. బీసీ సంఘం హుజురాబాద్ డివిజన్ సెక్రెటరీ కోడెపాక ఐలేష్ జమ్మికుంట టౌన్ లైన్ మెన్ గా రిలీవ్ అయ్యి చేల్పూర్ లైన్ మెన్ గా ఏ ఈ సంపత్ రెడ్డి జాయిన్ చేసుకున్నారు. దెబ్బేట సంపత్ సీనియర్ లైన్ ఇన్ స్పెక్టర్ గా జమ్మికుంట టౌన్ లో రిలీవ్ అయ్యి ఆముదాలపల్లి సీనియర్ లైన్ ఇన్ స్పెక్టర్ గా జూనియర్ అకౌంట్ ఆఫీసర్ నవీన్ హుజురాబాద్ ఈ ఆర్ ఓ నుండి రిలీవ్ అయ్యి జమ్మికుంట ఈ ఆర్ ఓ లో జాయిన్ కావడం జరిగింది. కెడం రజినీకాంత్ సైదాపూర్ లైన్ మెన్ గా రిలీవ్ అయ్యి హుజురాబాద్ రూరల్ సబ్ స్టేషన్ లైన్ మెన్ ఆపరేటర్ గా సంపత్ రెడ్డి జాయినింగ్ చేసుకున్నారు.ఆఫీస్ సబార్డినేటర్ స్వరూప హుజురాబాద్ ఈ ఆర్ ఓ నుండి జమ్మికుంట ఈ ఆర్ ఓ లో జైనింగ్ కావడం జరిగింది ఆఫీస్ రికార్డు అసిస్టెంట్ విజయ హుజురాబాద్ ఈ ఆర్ ఓ నుండి హుజురాబాద్ డివిజన్ ఆఫీస్ లో జాయినింగ్ కావడం జరిగింది. వీరిని ఉత్తర విద్యుత్ 327 యూనియన్ కంపెనీ సెక్రటరీ కొండూరి శ్రీనివాస్ కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి తులసి 327 యూనియన్ సర్కిల్ ప్రెసిడెంట్ యుగేందర్ సర్కిల్ సెక్రటరీ కే శ్రీనివాస్ కరీంనగర్ డివిజన్ సెక్రెటరీ రహిమతల్లి ఉత్తర విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కంపెనీ ఉపాధ్యక్షులు అంబాల వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు.

ఈ యొక్క కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం హుజురాబాద్ డివిజన్ సెక్రెటరీ సొల్లు లక్ష్మణ్ 327 హుజురాబాద్ డివిజన్ సెక్రటరీ శ్రీపతి సుధాకర్ ఎండి కాలిక్ దొడ్డే భాస్కర్ మచ్చ గిరి సుదర్శన్ మంద కుమారస్వామి గంగారపు రాజయ్య బాకీ సతీష్ వొజే కొమురయ్య తాళ్లపల్లి రాజేశం రాచపల్లి రాజయ్య బత్తుల రాజు రజనీకాంత్ పవన్ పుల్లూరి శ్రావణ్ కుమార్ భాగ్యలక్ష్మి రాజు రమేష్ బాబు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## బీడీ కార్మిక సంఘం జిల్లా మహాసభ ల కరపత్రం ఆవిష్కరణ



**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి అక్టోబరు 16:** జగిత్యాల జిల్లాలోని బీడీ పరిశ్రమలలో వివిధ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంక్షేమం కోసం హక్కుల కోసం నిరంతరం పోరాడే కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు తెలిపారు

ఈ సందర్భంగా జిల్లాలోని కోరుట్ల డివిజన్ కేంద్రంలోని కామ్రేడ్ సిలివేరి ప్రభాకర్ భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1963 లో ఏఐటీయూసీ కి అనుబంధంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీడీ కార్మిక సంఘాన్ని సి ప్రభాకర్ తన అనుచరులు కడకుంట్ల గంగారం మహబూబ్ అలీ కొక్కుల బుచ్చమ్మ నరసమ్మ గూడూరి గంగారం మార్గం రాజలింగం బోగ వెంకటి తదితర నేతలతో కార్మికులను ఐక్య పరిచి సంఘాన్ని ఏర్పాటు చేసి పల్లె నుండి ఢిల్లీ వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు చేసి కార్మికుల కొరకు అనేక హక్కులు సాధించడానికి అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు ప్రధానంగా బీడీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం బోనస్ జాతీయ పండుగ ఆదివారాలు పండుగ సెలవుల కూలి తోపాటు ప్రతి ఏప్రిల్ నెలలో కరువు భత్యం పెంపుదల రెండు సంవత్సరాలకు ఒకసారి నూతన వేతన అగ్రిమెంట్ కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో బీడీ యజమానులతో అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర బీడీ కార్మిక సంఘానికి ఉందన్నారు అలాగే 1995లో కార్మికులకు పెన్షన్ చట్టం కూడా సాధించిన ఘనత పోరాట ఫలితమే అన్నారు ఈ ప్రాంతంలో వ్యవసాయం తర్వాత బీడీ పరిశ్రమపై ఆధారపడ్డ బీడీ కార్మికులు ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని అన్నారు బీడీ రంగంలో పనిచేసే అన్ని వర్గాల కార్మికులకు కనీస వేతన జీవో ఇప్పటికీ అమలు లేదన్నారు నెలలో 20 రోజుల పనిని కల్పించవలసి ఉండగా కొన్ని కంపెనీలు పది రోజుల పని దినమే ఇస్తున్నారని దీని వాళ్ళ ఆర్థికంగా కార్మికులు నష్టపోతున్నారన్నారు బీడీ పరిశ్రమపై అనేక ఆంక్షలను విధిస్తూ బీడీ కట్టలపై డేంజర్ గుర్తులు ముద్రించాలని కేంద్రం ఆంక్షలు విధించింది అన్నారు బీడీ అమ్మకాలపై కొనుగోళ్లపై కూడా జిఎస్టి పెంచి పరిశ్రమను పెంచకుండా నిర్వీర్యం చేస్తుందన్నారు బీడీ సంక్షేమ ఆస్పత్రిలకు తగిన నిధులు కేటాయించకుండా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతున్నాయని అన్నారు కేంద్రంలోని ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఈపీఎఫ్ ఓ సంస్థల ట్రస్ట్ బోర్డ్ కనీస పెన్షన్ 6000 రూపాయలు ఇస్తామని గత పది సంవత్సరాల నుండి అమలు చేయడం లేదన్నారు అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు హామీ మేరకు జీవన భృతి కార్మికులకు 2000 నుండి 4000 రూపాయలకు పెంచుతామన్న హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు

అర్హులైన పేదవారికి ఇండ్లు నిర్మించి ఇస్తామని అలాగే స్థలం ఉంటే ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేస్తామని ఇచ్చిన హామీని సంవత్సరమైనా అమలు చేయలేదని అన్నారు ఈ సమస్యలన్నింటి పైన బీడీ కార్మిక సంఘం జిల్లా మహా సభలు ఈనెల 26న జిల్లాలోని మల్యాల మండల కేంద్రంలో ర్యాలీ బహిరంగ సభ చేపట్టి కార్మికుల సమస్యలు పరిష్కారం చేపట్టాలని మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు

ఈ మహా సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోగ గోవర్ధన్ పాల్గొంటారని తెలిపారు

అనంతరం బీడీ కార్మిక సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు

ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కుల శాంత ఉపాధ్యక్షులు చెన్న విశ్వనాథం కార్యదర్శి ఎండి ముక్రం మాజీ జిల్లా అధ్యక్షులు ఎండి మౌలానా ఎన్నం రాదా వడ్ల భాగమ్మ ఎన్నం రాజగంగు ఎండి సమీర్ తదితరులు పాల్గొన్నారు

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com